సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం ı 30 ı నవంబర్ ı 2023



..ఆయనే ప్రతినిధి
ఒక అభ్యర్థి 40 శాతానికి అటుఇటుగా వచ్చిన ఓట్లతోనే ప్రజాప్రతినిధి అవుతారు.

వివరాలు 8లో ▸



జడ్చర్లలో సోషల్ వార్
జడ్చర్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య బుధవారం సోషల్ వార్ జరిగింది.

వివరాలు 8లో ▸



వాతావరణం
అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

రాజులు పోయారు. రాజ్యాలు అంతరించాయి. రాజరికపు ఆనవాళ్లు అంతరించగా సంస్థానాలన్నీ విశాల భారత యూనియన్‌లో విలీనమయ్యాయి. రాజులుగా పాలన సాగించిన వారు ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికలతో చట్టసభల్లోకి అడుగుపెట్టారు. కొందరు మంత్రివర్గంలో సైతం పని చేశారు. నాటి సంస్థానాల నుంచి పార్లమెంట్, అసెంబ్లీలోకి అడుగుపెట్టిన పలువురు సంస్థానాధీశులపై ప్రత్యేక కథనం..

\- మహబూబ్‌నగర్ డెస్క్



సంస్థానాల నుంచి చట్టసభల్లోకి..


- రాచరికం నుంచి ప్రజాస్వామ్యం వైపు అడుగులు
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలు సంస్థానాలు
- దేశానికి స్వాతంత్య్రం అనంతరం రాజకీయాల్లోకి
- ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పనిచేసిన సంస్థానాధీశులు



స్వాతంత్య్రానికి పూర్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 16 సంస్థానాలు ఉండేవి. అందులో ముఖ్యమైనవి వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, అమరచింత సంస్థానాలు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటికీ.. నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కాలేదు. కేంద్రప్రభుత్వం 'ఆపరేషన పోలో'తో సైనిక చర్యకు దిగడంతో 1948 సెప్టెంబర్ 17న విలీనం కావడంతో ఈ ప్రాంతానికి స్వాతంత్య్రం సిద్ధించింది. దీంతో సంస్థానాలన్నీ పోయి ప్రజాస్వామ్య పాలన ఏర్పడింది. అప్పటి వరకు సంస్థానాధీశులుగా కొనసాగిన వారిలో కొంతమంది ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికల్లోనూ నిలబడి గెలిచారు. ప్రస్తుతం రాజవంశాలకు చెందిన వారు క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

గద్వాల

గద్వాల సంస్థానం తుంగభద్ర, కృష్ణానదుల మధ్య ప్రాంతంలో నడిగడ్డగా పిలిచే ప్రాంతంలో 800 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండేది. 14వ శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్యం పతనం తర్వాత గద్వాల సంస్థానాధీశులు బహుమనీ సామ్రాజ్యం సామంతులుగా ఉన్నారు. 1663లో రాజా పెదసోమభూపాలుడితో ప్రారంభమైన గద్వాల సంస్థాన పాలన విలీనమయ్యే వరకు కొనసాగింది. 1704లో నాడగౌడుగా ఉన్న సోమన్న కృష్ణానది తీరన గద్వాల కోటను నిర్మించారు. రాజ్యాన్ని బనగానపల్లె, ఆదోని, సిరివెల్ల, నంద్యాల, ఆత్మకూరు, అహోబిలం ప్రాంతాలకు విస్తరించారు. 1909 వరకు గద్వాల సంస్థానాధీశులు సొంత నాణేలను ముద్రించుకున్నారు. ఈ సంస్థానంలో 11 మంది రాజులు, 9 మంది రాణులు పాలించారు. చివరగా మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ 1924 నుంచి సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యే వరకు మహారాణిగా కొనసాగారు. గద్వాల సంస్థాన వారసుడైన కృష్ణ రాంభూపాల్‌రెడ్డి 1962లో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు.



కృష్ణ రాంభూపాల్‌రెడ్డి

వనపర్తి

హైదరాబాద్ రాష్ట్రంలోనే వనపర్తి సంస్థానంలో 124 గ్రామాలు ఉన్నాయి. ఇందులో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, కల్వకుర్తి, అచ్చంపేట(అమ్రాబాద్) తాలుకాలు ఉండేవి. 450 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉండేది. 1901లో జనాభా 62,197, ఆదాయం రూ.1.5 లక్షలు కాగా.. అందులో నుంచి నిజాం రాజుకు కప్పం రూ.76,883 కట్టేవారు. విజయనగర రాజుల కాలంలో రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన వీరకృష్ణారెడ్డి కృష్ణానది తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న పాతపల్లె, సూగురు గ్రామాల నుంచి ఈ సంస్థానానికి బీజాలు వేశారు. ఇతని మునిమనవడు గోపాలరావు గొప్పపండితుడిగా, పాలకుడిగా పేరు సంపాదించారు. ఇతనికి మొదట్లో సంతానం లేకపోవడంతో బంధువుల బిడ్డ వెంకటరెడ్డిని దత్తత తీసుకున్నాడు. తరువాత సంతానం కలిగినా ఈ దత్తపుత్రుడే పాలకుడయ్యాడు. వెంకటరెడ్డి తన దత్తుతల్లి పేర జానంపేటను, దత్తుతండ్రి పేరిట గోపాలపేటను ఏర్పాటుచేశారు. మొఘలుల రాజ్యాధికారాన్ని ధిక్కరించడంతో.. దక్కన్ సుబేదారు జానంపేటపై దండెత్తిన రావడంతో ఓడిపోయాడు. ఇతని తర్వాత బహిరీ చిన్నగోపాలరావు రాజుగా బాధ్యతలు స్వీకరించాడు. ఇతనికి కుతుబ్ షాహీ రాజులతో సాన్నిహిత్యం ఉండేది. 1946లో ఆయన మరణించగా కుమారుడు సవాయి వెంకటరెడ్డి సూగూరు సంస్థానం 1763 వరకు రాజుగా ఉన్నాడు. ఇతని హయాంలోనే రాజధానిని సూగురు నుంచి నేటి శ్రీరంగాపురానికి మార్చారు. దాదాపు 50 ఏళ్ల అక్కడే పాలన సాగింది. ఆ తర్వాత రాజధానిని వనపర్తికి మార్చారు. 1823లో రాజారామకృష్ణారావు తర్వాత ఆయన దత్తపుత్రుడు మొదటి రామేశ్వరరావు సంస్థానాధీశుడయ్యాడు. ఇతను ఆధునిక భావాలున్న వ్యక్తి కావడంతో బ్రిటీషు పాలనా విధానాలను అనుసరించే ప్రయత్నాలు చేశారు. 1853లో నిజాంరాజు తన సైన్యానికి రాజా రామేశ్వరరావును హైదరాబాదీ బెటాలియన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా నియమించాడు. 1866లో ఆయన మరణం తర్వాత ఆయన కుమారుడు రాజా కృష్ణప్రసాదరావు రాజు అయ్యారు. 1910లో రెండో రాజా రామేశ్వరరావు అబిస్సీనియులు., సోమాలీలు, ఐరోపాకు చెందిన వ్యక్తులతో కూడిన సైన్యం, అశ్వక దళాన్ని 6వ నిజం రాజుకు బహూకరించాడు. అదే అఫ్రికన్ క్వావలరీ గార్డ్స్ లేదా ఏసీ గార్డ్స్‌గా ప్రసిద్ధి చెందింది. 1922 నవంబర్ 22న రెండో రాజారామేశ్వర్‌రావు మరణించాడు. ఆయన తర్వాత 1922 నుంచి 1944 వరకు కృష్ణదేవరావు, 1944 నుంచి 1947 వరకు మూడో రామేశ్వరరావు సంస్థానాధీశులుగా కొనసాగారు. స్వాతంత్య్రం అనంతరం 2వ లోక్‌సభకు వనపర్తి సంస్థానాధీశుడు జనుంపల్లి రామేశ్వరరావు మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన 1967, 1971, 1977 ఎన్నికల్లో గెలిచారు. అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్‌నెహ్రూ హయాంలో విదేశాల్లో భారత రాయబారిగా పనిచేశారు. ఆయన చిన్నమ్మ కుముదినీదేవి 1962, 1967లో వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యేగా గెలిచారు. వీరి మరణం తర్వాత వారివంశానికి చెందిన వారు ఎవరూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు.



రామేశ్వరరావు



రాణి కౌముదినీ దేవి



అమరచింత

అమరచింత సంస్థానం ఎన్నో ఏళ్ల నాటిది. దీని రాజధాని ఆత్మకూరు. 69 గ్రామాలతో 190 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉండేది. రాజధానిని అమ్మాపూర్‌కు మార్చారు. క్రీ.శ.1676లో సర్వారెడ్డి నాడగౌడ్‌గా వచ్చారు. ఆ తర్వాత అభివృద్ధి అమరచింత సంస్థానంగా రూపొందింది. సర్వారెడ్డి అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. అతను ఔరంగజేబుకు సహాయం చేసేవారు. ఆయన తర్వాత ఆరుగురు రాజులు ఈ సంస్థానాన్ని పాలించారు. ఈ సంస్థానాధీశుడైన రాజా సోంభూపాల్ స్వాతంత్య్రం అనంతరం 1962 నుంచి 1978 వరకు మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి అమరచింత ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

కొల్లాపూర్

జటప్రోలు అత్యంత ప్రాచీనమైన సంస్థానం. ఈ సంస్థానాధీశులు కొల్లాపూర్‌ను రాజధానిగా చేసుకుని పరిపాలించడం ద్వారా కొల్లాపూర్ సంస్థానంగా పేరొచ్చింది. ఈ సంస్థానం కృష్ణానది ఒడ్డున, నల్లమల అటవీప్రాంతం ముందు విస్తరించి ఉంది. పాలకులంతా సురభివంశస్థులే కావడంతో వీరిని సురభిసంస్థానాధీశులు అని పిలుస్తారు. 1871లో నిర్మించిన కొల్లాపూర్ రాజవారి బంగ్లాను చంద్రమహల్, మంత్రమహల్, రాణిమహల్‌గా విభజించారు. 18వ శతాబ్దంలోనే ధర్మాస్పత్రిని ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్యం అందించేవారు. వీరికి ఆ రోజుల్లోనే సొంత విమానం ఉండేది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన అనంతరం ఈ సంస్థానానికి చెందిన వారు ఎవరూ రాజకీయాల్లోకి రాలేదు. అయినప్పటికీ కొల్లాపూర్ చివరి సంస్థానాధీశుడైన రాజా వెంకట జగన్నాథరావుకు బురుగుల రామకృష్ణారావుతో మంచి సాన్నిహిత్యం ఉండేది. స్నేహభావంతోనే తమ బంధువైన నర్సింగరావును 1957లో అసెంబ్లీ ఎన్నికల్లో రాజా వెంకటజగన్నాథరావు బాధ్యత తీసుకొని గెలిపించారు.



నేడే పోలింగ్

- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగింపు
- నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచుపెంటల్లో 9 కేంద్రాలు
- జిల్లాలో కొత్తగా పెరిగిన ఓట్లు 1,21,544 మంది
- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది
- కులాల వారీగా పార్టీల ఓట్ల లెక్కలు



నాగర్‌ర్నూల్‌లో ఈవీఎం డిస్ట్రిబ్యూటరీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

సాక్షి, నాగర్‌కర్నూల్ /అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుండగా, 5 గంటలలోపు క్యూలైన్‌లో ఉన్న వారందరికీ అధికారులు అవకాశం కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి పరిధిలోకి వెళ్లడంతో మిగిలిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 802 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో పోలింగ్ నిర్వహణకు పోలింగ్ అఫీసర్లు(పీఓ), అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు(ఏపీఓ), అదర్ పోలింగ్ ఆఫీసర్లు(ఓపీఓ), మైక్రో అబ్జర్వర్లు(ఎంఓ)గా విధులు నిర్వహించే అధికారులను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ సిద్ధం చేశారు. అనుకోని పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయంగా రిజర్వ్‌లో ఉంచిన అధికారులతో సహా మొత్తం 4,007 మందిని ఇందుకు సిద్ధంగా ఉంచారు. నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచుపెంటల్లో 9 చోట్ల అధికారులు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఆయా చోట్ల సిబ్బంది కోసం తాత్కాలికంగా టాయిలెట్ సౌకర్యాన్ని కల్పించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో సహా బుధవారం సాయంత్రానికే చేరుకున్నారు.

ఎన్నికల అధికారులకు సాయంగా..

ఆదే విధంగా వీరికి సాయంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు. ఇందుకు తహసీల్దార్లను తీసుకున్నారు. దాదాపు 24 మంది వరకు ఎన్నికల్లో అవలభించాల్సిన విధులు, ఎన్నికల నియమావళి, ఈవీఎంల ఇన్‌చార్జ్, తదితర వాటికి సంబంధించి నోడల్ అధికారులను నియమించారు. వారు వారి విధులను ప్రారంభించారు.

సెక్టార్ అధికారులది కీలకపాత్ర..

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులది కీలక పాత్ర వహిస్తారు. ఎన్నికల విధులపై సెక్టార్ అధికారులకు ఈవీఎంలపై శిక్షణ ఇచ్చారు. రిటర్నింగ్ అధికారులకు సెక్టారు అధికారులు అనుసంధానమై ఉంటారు. ఒక్కో రిటర్నింగ్ అధికారి కింద 20 నుంచి 30 సెక్టార్లు ఉంటాయి. 10 పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్టార్ ఆఫీసర్ నియమించారు. సెక్టారు అధికారులు ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు కలిగి ఉంటారు. వీరు ఎన్నికలకు సంబంధించి విధులు నిర్వహిస్తున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు...

ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒక్కో ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారిని నియమించారు. ఆదే విధంగా ఇద్దరి చొప్పున ఇతర పోలింగ్ అధికారులను నియమించారు. అయితే పోలింగ్ అధికారులను, సిబ్బందిని అవసరం ఉన్న దానికంటే 20 శాతం అదనంగా తీసుకున్నారు. వారిని రిజర్వ్‌లో ఉంచనున్నారు.

కులాల వారీగా ఓట్ల లెక్కలు..

కొన్ని రోజులుగా ఎన్నికల ప్రచారంతో హోరెత్తించిన పార్టీలు ఎన్నికల నాటికి పెద్దఎత్తున ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని అస్త్రాలను ప్రయోగించాయి. ప్రత్యేకంగా మహిళా సంఘాలపై దృష్టి సారించడంతో పాటు కుల సంఘాల వారీగా తాయిలాలను అందజేశాయి. వారిలో తమకు వచ్చే ఓట్లను అభ్యర్థులు అంచనా వేసుకుంటున్నారు. జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపుపై ధీమా ప్రదర్శిస్తుండగా.. జిల్లాలో కొనసాగను న్న ఓటింగ్ సరళిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సిబ్బంది బాధ్యతలు..

ప్రిసైడింగ్ అధికారుల కోసం: గెజిటెడ్ అధికారులను, సూపరింటుండెంట్లను, స్కూల్ అసిస్టెంట్లను తీసుకున్నారు.

అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల కోసం: ఎస్జీటీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లను తీసుకున్నారు.

ఇతర పీఓల కోసం: ఎస్జీటీ, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లలో జూనియర్లను తీసుకున్నారు. సొంత నియోజకవర్గం, పనిచేసే నియోజకవర్గం, నివాసముండే నియోజకవర్గంలో విధులకు అవకాశం ఉండదు. వీరు ఇతర నియోజకవర్గాల్లో పనిచేయాల్సి ఉంటుంది.

మొత్తం పోలింగ్ స్టేషన్లు : నాగర్‌కర్నూల్ 259, అచ్చంపేట 274, కొల్లాపూర్ 269	
ప్రిసైడింగ్ అధికారులు (పీఓ) : 802	
ప్రిసైడింగ్ అధికారులు (పీఓ రిజర్వు) : 161	
అసిస్టెంట్ ప్రిసైడెండ్ అధికారులు(ఏపీఓ) : 802	
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ రిజర్వు) :161	ఇతర పోలింగ్ అధికారులు(ఓపీఓలు) : 1,604
ఇతర పోలింగ్ అధికారులు ఓపీఓలు (రిజర్వు) : 321	మైక్రో అబ్జర్వర్లు (ఎంఓ) : 130
మైక్రో అబ్జర్వర్లు (ఎంఓలు రిజర్వు) : 26	

పూర్తయిన అధికారుల కసరత్తు..

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్డు విడుదలైనప్పటి నుంచి ఓటరు నమోదు, ఓటరు మార్పు, పేరులో తప్పుల సవరణలు చేపట్టారు. పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి కొత్త ఓటర్లు నమోదుకు శ్రీకారం చుట్టి సక్సెస్ అయ్యారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నాలుగు నియోజకవర్గాల పరిధిలో 1,21,544 ఓటర్ల వరకు కొత్తగా పెరిగాయి. అంతకు ముందే ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని నియమించారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి నలుగురు ఆర్వోలను నియమించారు. డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓ స్థాయి అధికారిని నియమించారు. వీరు ఎన్నికల నిర్వహణ చేయాల్సి ఉంటుంది. ఓటరు జాబితా మొదలుకొని నామినేషన్లు, ఉపసంహరణ, పరిశీలన, పోలింగ్, ఓట్లలెక్కింపు, అనంతరం గెలిచిన వ్యక్తులకు నియామక పత్రాలను అందించే వరకు వీరు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు, ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పించింది.



పోలింగ్ కోసం సిద్ధం చేసిన ఈవీఎంలు

595 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

నాగర్‌కర్నూల్: జిల్లాలోని 802 పోలింగ్ కేంద్రాలకు గాను 595 పోలింగ్ కేంద్రాలను వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్ కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఎన్నికల కంట్రోల్ రూంను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో నిఘా కళ్లు వెబ్ కాస్టింగ్ పక్కాగా ఏర్పాటు చేయాలని ఈడీఎంను ఆదేశించారు. మారుమూల ప్రాంతాలు, సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలోని 106 సెక్టార్ అధికారుల వాహనాలకు జీపీఆర్ఎస్ అనుసంధానం చేశామన్నారు. వాహనాలు ఏ పరిధిలో ఉన్నాయో గుర్తిస్తామన్నారు. ఎక్కడ సమస్య ఉందో అక్కడికి వెంటనే చేరేలా జిల్లా కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు దిశా నిర్దేశాన్ని అందజేసి, పోలింగ్ కేంద్రాల సమస్యలను అత్యంత తక్కువ సమయంలోనే పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామన్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలోని ఎన్నికల సిబ్బందిని ఈవీఎంల ద్వారా తరలించేందుకు 100 ఆర్టీసీ బస్సులను వినియోగించామన్నారు. వాటికి జీపీఆర్ఎస్ అనుసంధానం చేశామన్నారు. అదేవిధంగా చెంచుపెంటల్లోని 9 పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా వీడియో ఫొటో కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను రికార్డ్ చేస్తున్నట్లు చెప్పారు. 198 సాధారణ పోలింగ్ కేంద్రాల్లో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కంట్రోల్ రూం నోడల్ అధికారిగా ఈడీఎం నరేష్‌ను నియమించనున్నట్లు తెలియజేశారు. ఈ ప్రక్రియలో నిష్ణాతులైన ఎన్ఐసీ కోఆర్డినేటర్ హర్షద్ రాఘవేంద్ర, హేమంత్, సాయి, కీర్తన్, ప్రసాద్, గురుబ్రహ్మం, శ్రీకర్ యాదవ్, తదితరులు జిల్లా ఎన్నికల కంట్రోల్ రూం ప్రక్రియను కొనసాగించనున్నట్లు వివరించారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం

జిల్లాలో 144 సెక్షన్ అమలు

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలు ఉంటుందని, ప్రజలు గుంపులు, గుంపులుగా ఐదుగురు కంటే ఎక్కువ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా డబ్బు, మద్యం ఉచిత కానుకల ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంతో పాటు ఓటర్లను ఎవరైనా భయభ్రాంతులకు గురి చేయకూడదని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను ఉచిత రవాణా నిషేధమని, ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కి 48 గంటల ముందు రాజకీయ పార్టీలు ఉద్దేశంతో కూడిన సందేశాలు, ఆడియో మెసేజీలు సోషల్ మీడియా ద్వారా పంపెవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల అవతల వాహనాలను పార్క్ చేయాలని, దివ్యాంగులకు వీల్‌చైర్ మాత్రమే అనుమతిచబడుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు అనుమతి నిషేధమని, ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లకు భద్రత రీత్యా ఎలాంటి సమస్యలు ఎదురైన నాగర్‌కర్నూల్ పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712657709, డయల్ 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

సర్వం సిద్ధం

- పోలింగ్ అనంతరం నాగర్‌కర్నూల్ నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో రిసీవింగ్ కేంద్రానికి చేరుకోవాలి
- మూడో తేదీ కౌంటింగ్‌కు ఏర్పాట్లు
- 595 కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి నేరుగా పర్యవేక్షణ
- కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లో జరిగే పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టం చేశామని ఎన్నికల అధికారి పి. ఉదయ్ కుమార్ తెలియజేశారు. బుధవారం ఆయన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించేలా పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. 802 పోలింగ్ స్టేషన్లకు 87 రూట్లు, నియోజకవర్గాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అన్ని మెటీరియల్, ఈవీఎంలు అప్పగించి, భద్రతా దళాల మధ్య రూట్ల వారీగా పంపించామని తెలియజేశారు. బుధవారం సాయంత్రం వరకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని అక్కడ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుని గురువారం ఉదయాన్నే 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించాలన్నారు. అన్ని క్లియర్ చేసిన అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభించి పారదర్శకంగా ముగించాలని సూచించారు.



సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

సీసీ కెమెరాలు ఏర్పాటు..

595 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 194 పోలింగ్ కేంద్రాల్లో, అచ్చంపేటలో 199 పోలింగ్ కేంద్రాల్లో, కొల్లాపూర్‌లో 202 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. నాగర్కర్నూల్ నియోజకవర్గంలో 168, అచ్చంపేటలో 145, కొల్లాపూర్‌లో 136 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన రిసీవింగ్ సెంటర్‌కు అధికారికంగా ఏర్పాటు చేసిన బస్సుల ద్వారానే తరలిరావాలని సూచించారు. డిసెంబర్ మూడో తేదీ కౌంటింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా నచ్చిన వ్యక్తికి ధైర్యంగా ఓటు వేయాలని కలెక్టర్ ప్రజలను కోరారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎలక్షన్ అబ్జర్వర్లు మిథిలేష్ మిశ్రా, భేరారామ చౌదరి, సతీష్ కుమార్ పర్యవేక్షణలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి వెంకట్ రెడ్డి, కొల్లాపూర్ రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్, అచ్చంపేట రిటర్నింగ్ అధికారి గోపి రామ్, ఇతర ఎన్నికల పర్యవేక్షణ నోడల్ అధికారులు పోలింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ అధికారులు అందరూ పోలీస్ బందోబస్తు మధ్య వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు ఎన్నికల అధికారి కలెక్టర్ తెలియజేశారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బందితో పాటు కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు నియోజకవర్గంలోని 24 గంటల పాటు తనిఖీలు నిర్వహించనున్నట్లు వివరించారు.



నల్లమల చెంచుపెంట ఫరహాబాద్ పోలింగ్ కేంద్రానికి చేరకున్న ఎన్నికల సిబ్బంది

..ఆయనే ప్రతినిధి

- 40–50 శాతం ఓట్లు తెచ్చుకుంటే విజయం వరించినట్టే
- మిగతా 60 శాతం మందికి వారే పాలకుడు
- చాలా నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి
- దమాషా పద్ధతిలో ఎన్నికలు సాధ్యమేనా..?

ఒక నియోజకవర్గంలో నలుగురు అభ్యర్థులు పోటీపడి తలా ఇన్ని ఓట్లు రాబట్టుకుంటే.. ఆ అభ్యర్థికి 40 నుంచి 50 శాతానికి అటుఇటుగా వచ్చిన ఓట్లతోనే ప్రజాప్రతినిధి అయ్యారు. మిగతా వారికి ఓటు వేసిన 60 శాతానికిపైగా ఓటర్లకు కూడా ఆయనే ఐదేళ్ల పాలకుడు. ఈ నేపథ్యంలో మూడోవంతు ఓట్లు కూడా రాని వాళ్ల ప్రజాప్రతినిధులు అవుతుండటం మనదేశంలో సర్వసాధారణంగా మారింది. మరి ఇలాంటి వారు నిజంగా గెలిచేదెవరో.. ఓడేదెవరో చూద్దాం.!

– కల్వకుర్తి టౌన్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొడంగల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, వనపర్తి, గద్వాల, అలంపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, షాద్‌నగర్, కొల్లాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. 2018లో కల్వకుర్తిలో 16 మంది అభ్యర్థులు పోటీచేయగా.. వారిలో ప్రధానంగా ముగ్గురి మధ్యనే పోటీ నెలకొంది. గెలిచిన అభ్యర్థి 3,447 ఓట్ల తేడాతో గెలుపొందగా.. వీరిద్దరి మధ్య గెలిచిన అభ్యర్థికి 35.35 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అదేవిధంగా నారాయణపేట నియోజకవర్గంలో 11 మంది పోటీ చేయగా.. వారిలో నలుగురి మధ్యనే పోటీ నెలకొంది. తీవ్ర ఉత్కంఠ పోరులో గెలిచిన అభ్యర్థికి 42.51 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇలా ఏ ఎన్నికలను పరిశీలించినా మొత్తం ఓట్లలో సగానికి పైగా పోలైన అభ్యర్థులు చాలా తక్కువగానే ఉన్నారు. గెలుపు, మెజారిటీకి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. పోటీలో ఉన్న గత అభ్యర్థులు కంటే కొద్ది తేడాతో ఓట్లు వచ్చినా, గెలిచినట్లే భావించాల్సి వస్తుంది. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా, వాటి ఫలితాలు చూసినా ఇదే పరిస్థితి. లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే జరుగుతుంది.

దామాషా పద్ధతి ప్రకారం..

తమ నియోజకవర్గంలోని మొత్తం ఓట్లలో సగం కూడా సాధించకుండా చట్టసభల్లోకి నేతలు ప్రవేశిస్తుండటంపై మేధావులు, రాజకీయవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల విధానంలో మార్పు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇతర దేశాల్లో మాదిరిగా మనదేశంలో కూడా దమాషా పద్ధతి అమలు చేయాలంటున్నారు. ఈ విధానంలో అభ్యర్థులు ఎవరన్నది గోప్యంగా ఉంచి కేవలం పార్టీ గుర్తుతోనే ఓటింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థుల వివరాలను మాత్రం పోలింగ్‌కు ముందే ఎన్నికల సంఘానికి పార్టీలు సమర్పించాల్సి ఉంటుంది. ఫలితాల్లో ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి వాటికి ఎన్నికల సంఘం సీట్లు కేటాయిస్తుంది. వచ్చిన సీట్లలో అభ్యర్థులను పార్టీలు బహిరంగపరుస్తాయి. ప్రస్తుతం ఈ విధానాన్నే చాలా దేశాలు అనుసరిస్తాయి.



మన దేశంలో సాధ్యమేనా..?

ఇతర దేశాలలో జనాభా తక్కువ ఉండటంతో దమాషా ప్రక్రియ సాధ్యమవుతుంది. మన దేశంలో అయితే కష్టమే అనే వాదన కూడా ఉంది. ఎన్నికలు అంటే సుమారు ఆరు నెలల ప్రక్రియ. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు, కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలు, రాష్ట్ర ప్రభుత్వంలో ఎన్నో శాఖల అధికారులు, ఉద్యోగులు ఎన్నికల నిర్వహణలో తీరిక లేకుండా పనిచేస్తారు. దమాషా ప్రకారం ఎన్నికలు కావాలంటే రాజ్యాంగ సవరణ చేయాలి. దీనికి లోక్‌సభ, రాజ్యసభల ఆమోదం పొందాలి. ఇంత పెద్ద నిర్ణయం అమలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా.. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను కోరుతుంది. ఈ ప్రతిపాదనను మెజార్టీ రాష్ట్రాలు తిరస్కరిస్తే కేంద్రం చట్టం చేయడానికి వెనకడుగు వేయాల్సిందే.

సగానికిపైగా వస్తేనే..



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరైనా సగానికి పైగా ఓట్లు రాబడితేనే ప్రజాప్రతినిధిగా ఉండాలి. 30– 40 శాతం ఓట్లు వచ్చినా వారు మిగతా వారికి ప్రజాప్రతినిధిగా ఉండటం ఇబ్బందికర అంశమే. దమాషా పద్ధతి ప్రకారం ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాలు, అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఆలోచించి, ప్రజాస్వామ్యానికి అనుగుణంగా ప్రజలకు పాలన అందించే అవకాశం ఉంటుంది.

– ప్రశాంత్, న్యాయవాది, కల్వకుర్తి

హక్కులు కోల్పోతున్నారు



ఓట్ల శాతం తక్కువగా వచ్చిన ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో గెలవడంతో వారు ప్రజలను పట్టించుకోకుండా ఉంటున్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇచ్చే వాటికి ప్రలోభపడి ఓట్లు వేస్తుండటంతో.. ఓటర్లు వారి ప్రాంతానికి సరిపడా అభివృద్ధిని అడిగే హక్కును కోల్పోతున్నారు. దీంతో ప్రాంతాలు వెనకబడటమే కాక, అభివృద్ధి చెందలేకపోతున్నాయి.

– మజహర్, నిరుద్యోగి, కల్వకుర్తి

ఇతర దేశాలలో..

ప్రపంచంలోని పలు దేశాలలో పోలింగ్‌కు.. మన దేశంలో పోలింగ్‌కు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఇతర దేశాల్లో ఫలితాలు వచ్చినప్పటికీ 51 శాతం ఓట్లు రాకపోతే మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారు. పోటీ చేసిన అభ్యర్థుల్లో టాప్‌లో ఉన్న ఇద్దరు లేదా ముగ్గురిని మాత్రమే కౌంట్‌లోకి తీసుకొని, మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారు. బరిలో ముగ్గురే ఉండటంతో ఖచ్చితంగా ఒక అభ్యర్థి 51 శాతం ఓట్లు సాధిస్తారని అక్కడి వాళ్ల నమ్మకం. అప్పుడే అభ్యర్థి గెలిచినట్లుగా భావిస్తారు.

2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం	విజేత	మొత్తం ఓట్లు	గెలిచిన వారికి పోలైన ఓట్లు	పోలైన ఓట్ల శాతం
కొడంగల్	పట్నం నరేందర్ రెడ్డి	2,01,941	80,754	48.78
నారాయణపేట	రాజేందర్ రెడ్డి	2,03,032	68,767	42.51
మహబూబ్‌నగర్	శ్రీనివాస్‌గౌడ్	2,13,070	86,474	54.16
జడ్చర్ల	లక్ష్మారెడ్డి	1,94,944	94,598	58.95
దేవరకద్ర	ఆల వెంకటేశ్వర్ రెడ్డి	2,04,930	96,130	55.12
మక్తల్	చిట్టెం రామ్మోహన్ రెడ్డి	2,11,405	78,538	47.77
వనపర్తి	సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి	2,28,069	1,11,956	60.31
గద్వాల	కృష్ణమోహన్‌రెడ్డి	2,26,636	1,00,057	52.60
అలంపూర్	అబ్రహం	2,17,366	1,02,105	56.63
నాగర్‌కర్నూల్	మర్రి జనార్దన్ రెడ్డి	2,02,604	1,02,493	60.80
అచ్చంపేట	గువ్వల బాలరాజు	2,14,152	87,841	50.11
కల్వకుర్తి	గుర్క జైపాల్‌యాదవ్	2,04,002	62,892	35.36
షాద్‌నగర్	అంజయ్య యాదవ్	1,89,088	72,315	43.43
కొల్లాపూర్	బీరం హర్షవర్ధన్‌రెడ్డి	2,09,086	80,617	46.36



గద్వాలలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి వల్లూరి క్రాంతి



మహబూబ్‌నగర్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు



మహబూబ్‌నగర్ నుంచి పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది



మహబూబ్‌నగర్ బాలుర కళాశాల మైదానంలో సామగ్రిని పరిశీలించుకుంటున్న సిబ్బంది

నేడే.. తీర్పు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం 7గంటలకు ప్రారంభం అయ్యే పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అన్ని గ్రామాల్లో, మండలాల్లో పోలింగ్ కేంద్రాలు సిద్ధం కాగా, సిబ్బందితో పాటు ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి బుధవారం సాయంత్రం చేరుకుంది. అన్ని నియోజకవర్గాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఎన్నికల వేళ హోరెత్తించిన ప్రచారాలు మంగళవారం నుంచి నిశ్శబ్దం నెలకొంది. ఓటర్లు తమ ఓటును వినియోగించుకుని, అభ్యర్థుల భవిష్యత్‌ను గురువారం నిర్ణయించనున్నారు.



ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో కర్ణాటక పోలీసులు



జడ్చర్ల, దేవకరకద్ర పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది



అలంపూర్‌చౌరస్తాలోని మార్కెట్‌యార్డులో ఎన్నికల నిర్వాహక అధికారులు



కొల్లాపూర్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన పోలీసులు




జడ్చర్ల నుంచి వీవీప్యాట్‌లు, ఈవీఎంలు తీసుకువెళ్తున్న పోలింగ్ సిబ్బంది



నారాయణపేటలో వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జడ్చర్లలో సోషల్ వార్

- అనిరుధ్‌రెడ్డి హౌస్ అరెస్ట్ అంటూ హల్‌చల్
- ఆరోపణలను తోసిపుచ్చిన బీఆర్‌ఎస్



జడ్చర్ల: నియోజకవర్గంలో బుధవారం సోషల్ మీడియాలో రచ్చ రచ్చ జరిగింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వాట్సాప్ గ్రూప్‌లలో ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు గుప్పించుకున్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారని, ఇందుకు స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి కారణమని, ఆయన ప్రోద్బలంతోనే తనను హౌస్ అరెస్ట్ చేశారని స్వయంగా అనిరుధ్‌రెడ్డి తన వీడియోను విడుదల చేశారు. సదరు వీడియోను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ నేత లక్ష్మారెడ్డికి అనుకూలంగా స్పందించారు. మంగళవారం రాత్రి రాయదుర్గంలోని అనిరుధ్‌రెడ్డి ఇంటి నుంచి జడ్చర్లకు తరలిస్తున్న డబ్బును పోలీసులు పట్టుకున్నారని, ఇందుకు సంబంధించి విచారించేందుకు పోలీసులు రాకుండా వస్తారా అంటూ తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ పేరుతో ఓ మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. తనను హౌజ్ అరెస్ట్ చేశారంటూ సింపతి సృష్టించి ఓట్లు దండుకునేందుకు అనిరుధ్ కుట్రకు తెరలేపారని బీఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియాలో ప్రతిస్పందించారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అండదండగా ఉండాల్సిన అనిరుధ్‌రెడ్డి వారిని తప్పించుకునేందుకు హౌస్ అరెస్ట్ డ్రామాకు తెరతీశారని బీఆర్‌ఎస్ ఆరోపణలు చేసింది. అంతేగాక హౌస్ అరెస్ట్‌పై పోలీసుల నుంచి ఎలాంటి ప్రకటన లేదన్నారు. ఆయన అనుకుంటే జడ్చర్లకు సునాయసంగా వచ్చే అవకాశం ఉందని, లేకపోతే తామే కారులో జడ్చర్లకు తీసుకువస్తామంటూ బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. కాగా తమ గెలుపును జీర్ణించుకోలేకనే స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇలాంటి కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఏదేమైనా పోలింగ్ దగ్గరపడుతున్న వేళ ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు. పోలింగ్ ప్రశాంతంగా కొనసాగేలా పోలీసులు చర్యలు చేపట్టాలని ఓటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్: అచ్చంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి సస్పెన్షన్ చేస్తూ.. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కొల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయుడు కె.రామ్‌జీ, ఉప్పునుంతల మండలం పులియా నాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు కె. రాజును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు.

ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో తనిఖీలు

అడ్డాకుల: మూసాపేట మండలం అచ్చాయపల్లి సమీపంలో ఉన్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఫాంహౌస్‌లో బుధవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. డబ్బుల పంపిణీ చేపట్టారని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో అధికారులు వెళ్లారు. తనిఖీలు చేయగా ఎలాంటి నగదు లభించలేదని తెలిసింది.

ఓట్లు.. రకాలు



- పోలింగ్‌కు ముందుగానే ఓటరుగా నమోదు
- వివిధ ప్రక్రియలపై ఓటరుకు అవగాహన అంతంత మాత్రమే

కల్వకుర్తి టౌన్: పోలింగ్ రోజున అందరికి తెలిసిన ఓటే కాకుండా మరికొన్ని రకాల ఓట్లు ఉంటాయి. వీటిలో కొన్ని లెక్కింపులోకి రాకున్నా, వేటికవే ప్రత్యేకతలను కలిగి ముఖ్యపాత్ర పోషిస్తుంటాయి. ఎన్నికల విధులు, రక్షణ దళాలలో ఉండే వారు వేసే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల గురించి తెలిసినంతగా మిగతా ఓట్లపై ఓటర్లకు పెద్దగా అవగాహన ఉండదు. అలాంటి ఓట్ల రకాల గురించి చూద్దాం.

నమూనా ఓటు

ఓటింగ్ యంత్రం తనిఖీ కొరకు పోలింగ్ మొదలు కావడానికి గంట ముందుగా పోలింగ్ ఏజెంట్లు 50 వరకు ఓట్లు వేస్తారు. వాటి లెక్కింపును వెంటనే పూర్తిచేసి యంత్రం నుంచి ఆ ఓట్లను తొలగించాకే అసలైన పోలింగ్‌ను మొదలు పెడతారు. ఇలా నమూనా పోలింగ్ సమయంలో వెలువడే ఓట్ల స్లిప్పులను ఒక కవర్‌లో భద్రపరుస్తారు.

టెస్ట్ ఓటు

ఓటును వేసిన తర్వాత వీవీ ప్యాట్‌లో కనిపించే పేపరు స్లిప్పులో వివరాలు సక్రమంగా లేనట్టుగా ఓటరు నిర్ధారించుకున్నప్పుడు ఆయన పోలింగ్‌నే నిలుపుదల చేయవచ్చు. అది ఎలా అంటే.. తన ఓటు తాను కోరుకున్న అభ్యర్థికి పడనట్లుగా వీవీ ప్యాట్‌లో ప్రత్యక్షమైన స్లిప్పులో కనిపిస్తే తొలుత ఆ ఓటరు ఫిర్యాదు చేయాలి. అప్పుడు ప్రిసైడింగ్ అధికారి అతనితో మట్లాడి, తప్పుడు అభియోగం అయినట్లయితే దారితీసే పరిణామాలపై హెచ్చరిస్తారు. అనంతరం ఆయన నుంచి లిఖిత పూర్వక ఆమోదం తీసుకుని, పోలింగ్ ఏజెంటు సమక్షంలో ఓటింగ్ మిషన్‌లో టెస్ట్ ఓటును నమోదు చేసేందుకు అనుమతిస్తారు. ఓటరు చెప్పినట్లుగానే వీవీప్యాట్ నుంచి వెలువడే స్లిప్పులో ఓటువేసిన అభ్యర్థి వివరాలు కాకుండా వేరేవారి వివరాలు వచ్చినట్లయితే వెంటనే పోలింగ్‌ను నిలిపివేస్తారు. ఒకవేళ ఆరోపణ తప్పని తేలితే ఫారం–17లో ఆ ఓటరుకు సంబంధించిన రెండో ఎంట్రీకి ఎదురుగా సంబంధిత ఓటరు ఏ అభ్యర్థి పక్షాన ఓటును వేసింది రాసి, ఆయన సంతకాన్ని గానీ, వేలిముద్రను తీసుకుని ఆయన్ను పోలీసులకు అప్పగిస్తారు.

టెండర్ ఓటు

ఓటరు ఓటేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లేసరికి ఆయన ఓటును ఎవరైనా వేసినట్లయితే అప్పుడు అతను టెంటర్ ఓటును వేయవచ్చు. ఇలా వచ్చిన వ్యక్తిని అక్కడి అధికారి నిజమైన ఓటరుగా నిర్ధారించుకున్న తర్వాత ఆయనకు బ్యాలెట్ పత్రాన్ని అందజేస్తారు. ఈవీఎంలోని మీటను నొక్కేందుకు మాత్రం అనుమతించరు. టెండర్ ఓటును వేసిన తర్వాత దాన్ని ప్రత్యేకంగా కవర్‌లో భద్రపరుస్తారు. అభ్యర్థుల మధ్య ఓట్లు సమానంగా వచ్చినప్పుడే వీటిని పరిగణలోకి తీసుకుంటారు.

చాలెంజ్ ఓటు

ఓటరు తీరా పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత అసలు అతను ఓటరు కాదని అక్కడే ఉండే పోలింగ్ ఏజెంట్ నుంచి ఛాలెంజ్ రావచ్చు. ఆ సమయంలో అనుమతించేదే చాలెంజ్ ఓటు. సవాల్ చేసిన ఏజెంట్ నుంచి రూ.2 రుసుమును తీసుకుని రశీదును ఇస్తారు. అనంతరం ఏజెంట్, ఓటరు వాదనలను పీఓ విని, అక్కడకు వచ్చిన ఇతర ఓటర్ల నుంచి వివరాలను రాబడతారు. నిజమైన ఓటరుగా నిర్ధారణ అయితే అతన్ని ఓటు వేయడానికి అనుమతిస్తారు. నిర్ధారణ కాకపోతే అతన్ని పోలీసులకు అప్పగిస్తారు. చాలెంజ్ ఓటు వేసిన వ్యక్తి పేరు, చిరునామాలను ఫారం–14లో పేర్కొంటారు.

సర్వాంగ సుందరంగా పోలింగ్ స్టేషన్

అడ్డాకుల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మోడల్ పోలింగ్ స్టేషన్‌గా ఎంపిక చేసి ఓటర్లను ఆకట్టుకునే విధంగా కేంద్రాన్ని అందంగా అలంకరించారు. స్వాగత ద్వారం వద్ద నుంచి పోలింగ్ కేంద్రం లోపలి వరకు వివాహ వేడుకల్లో అలంకరించే విధంగా అందంగా ముస్తాబు చేశారు. గేటు ముందు మహిళలు ముగ్గులు వేశారు. దీంతో చాలా మంది గ్రామస్తులు పోలింగ్ కేంద్రం వరకు వచ్చి ఏర్పాట్లను చూసి వెళ్తున్నారు.

– అడ్డాకుల



అడ్డాకులలో అందంగా ముస్తాబైన పోలింగ్ కేంద్రం